పిల్లల చదువు ఏమవుతుంది. పిల్లల్ని యిక్కడ వదిలి తను అక్కడ....అమ్మో. అది లాభంలేదు. ఆలోచనతో బుర్ర వేడెక్కింది.

❋

"ఆలోచిస్తుంటే మతి పోతోంది మాధవీ. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. ఛా...ఛా.... ఆడదాని బ్రతుకు రోజు రోజుకి అధ్వాన్నమవుతుందనిపిస్తుంది. ఇదివరకటి ఆడవాళ్ళకి ప్రాబ్లమ్స్ లేవు. హాయిగా తెచ్చి పడేసింది వండి పిల్లల్ని కంటూ ఏ బాధలూ అవమానాలు సమస్యలు లేకుండా అమాయకంగా బతికేవారు. ఆనాడు కేవలం స్త్రీ వంటింటి కుందేలు. పిల్లల్ని కనే యంత్రం, కాని మనం ఏం సాధించాం. వాటితో పాటు డబ్బు కూడా సంపాదించే యంత్రంగా మారాము. ఆడది ఉద్యోగం చేయడం ఆత్మ స్థైర్యానికి అని అనుకోడం మనల్ని మనం వంచించు కోడానికే. ఆడదాని ఉద్యోగం అవసరాలు తీర్చుకోడానికి. అదీ మగవాడి అవసరాలు. తను ఆడదాని బాధ్యత పంచుకోక పోయినా బాధ్యత సగం మోపడానికి ప్రయత్నిస్తున్నాడు ఈనాటి పురుషుడు" ఉక్రోషంగా, కసిగా అంది సునీత.

"అవును సునీతా, మనం ట్రాన్సిట్ పీరియడ్‌లో వున్నాం. ఇటు పాతకాలం ఆడదానిలా వుండలేక, విదేశీ వనితల మాదిరి పూర్తి స్వేచ్ఛా స్వతంత్రాలు లేక మధ్య దారిలో దారితెలియక కొట్టు మిట్టు ఆడుతున్నాం. యిదంతా స్త్రీ పురోగమనానికి నాంది అనుకుంటే మనం ఆ పురోగమనానికి పునాది రాళ్ళం. ఈ పునాదులు ఎండకి వానకి తడిసి రాటకి పోటకి ఆగితే ఆ పునాది మీద భవంతి లేస్తుంది. ఈ నాడు మనం వేసిన పునాది పై భవంతిలో తరువాత తరం స్త్రీలు హాయిగా ఆనందంగా స్వేచ్ఛావాయువులు పీలుస్తారని ఆనందిద్దాం. అంతకంటే మనం ఏం చెయ్యగలం" మాధవి అంది.

సునీత విస్ఫారిత నేత్రాలతో మాధవి వంక అభినందిస్తున్నట్టు చూసింది. 'కరక్ట్ ఎంత బాగా చెప్పింది మాధవి. ఒక మంచిపనికి అనేక త్యాగాలవసరం మన జాతి విముక్తికి గాంధి ఎంత త్యాగం చెయ్యాల్సి వచ్చింది. స్త్రీ జాతి విముక్తికి, పురోగమనానికి మనం పునాదిరాళ్ళం అయినా పరవాలేదు. తరువాత తరం స్త్రీ కోరుకున్న ఆత్మ స్థైర్యం, స్వశక్తి వగైరాలు లభ్యమయితే....'అనుకుంది సునీత నిట్టూరుస్తూ. □

# పెదవులకు రంగులు మంచివేనా?

ఉన్నతవర్గాలకు సంబంధించినంతవరకూ నేడు స్త్రీలను అమితంగా ఆకర్షిస్తున్న సౌందర్య సాధనం – 'లిప్‌స్టిక్' ఈ లిప్‌స్టిక్ అనేది నిజం చెప్పాలంటే స్త్రీలకు అంత అత్యవసరమైన, ముఖ్యమైన సాధనం కాదు. కాని స్త్రీల మనస్తత్వాన్నిబట్టి చూస్తే, ఈ లిప్‌స్టిక్‌ను వాడటంవల్ల తాము మరింత అందంగా ఆకర్షణీయంగా, తాజాగా కనిపిస్తామనే ఈ మానసిక దౌర్బల్యంవల్లనే స్త్రీలు ముఖ్యంగా యువతులు ఈ లిప్‌స్టిక్‌ను వాడటం జరుగుతున్నది.

అసలు మొట్టమొదట లిప్‌స్టిక్‌లు తెలుపు రంగులో వుండి, పగిలిన పెదాలకు, వాటిలో వున్న పగుళ్ళచారలు కనుపించకుండా వుండటానికి వేసుకునేందుకు ఉపయోగించేవారు. ఈనాడు లభ్యమవుతున్న లిప్‌స్టిక్‌లకు ఆ తొలి రోజుల్లోని లిప్‌స్టిక్‌లకు చాలా తేడా వుంది. ఈనాడు లిప్‌స్టిక్‌లు చాలా రంగులలోనూ, షేడ్లలోనూ వస్తున్నాయి.

లిప్‌స్టిక్స్ తయారీలో వాడబడే పదార్థాలు వివిధ రకాలైన మైనాలు, తైలాలు, క్రొవ్వులు, రంగు పదార్థాలు, సువాసన ద్రవ్యాలు మొదలయినవి. మైనాలలో ('వాక్స్'లు) బీ-వాక్స్, పారఫిన్ మైనం, తైలాలో ఆముదము (కాస్టర్ ఆయిల్) రంగులలో ఈ యోసిన్‌డైలు మొదలయిన పదార్థాలను లిప్‌స్టిక్‌లను తయారు చేయడానికి ఉపయోగిస్తారు. లిప్‌స్టిక్స్‌కి మంచి వాసన రావడానికి పండ్ల సంబంధమైన సుగంధ ద్రవ్యాలను చేర్చుతుంటారు. అయితే మంచి లిప్‌స్టిక్ ఏ విధంగా ఉండాలి?

* లిప్‌స్టిక్‌లో మాయిశ్చర్ (తేమ) శాతం ఎక్కువగా వుండి, పెదవులకు రాసుకొన్నపుడు మంచు బిందువులు వుండే మెరుపులో మెరుస్తూ వుండాలి.
* లిప్‌స్టిక్‌లో వాడే రంగులు దేహ ఉష్ణోగ్రతకి ఆవిరి అయేటట్లు కాకుండా వుండి ప్రకాశవంతంగా వుండాలి.
* లిప్‌స్టిక్‌లను తయారు చేసేటపుడు వాటికి తియ్యని రుచి, వాసనగల పదార్థాలను కలపాలి.
* లిప్‌స్టిక్‌లో వాడే పదార్థాలు పెదవులకు, శరీరానికి హాని కలిగించేవిగా వుండకుండా జాగ్రత్తపడాలి.
* వాతావరణంలో వున్న మార్పులకు చర్య చెందకుండా వుండే రసాయనికాలనే లిప్‌స్టిక్‌లో వాడాలి.

కానీ ఈనాడు మనకి లభ్యమవుతున్నవాటిల్లో మనం పైన చెప్పుకొన్న యే వొకటో, రెండో లక్షణాలు తప్ప, మిగతావి పూర్తిగా లోపిస్తున్నాయి.

మానవ దేహంలో 'స్వేదగ్రంథులు' (స్వెట్‌గ్లాండ్స్) లేని ప్రాంతం 'పెదవులు'. పెదవులపైన అతి పలుచగా వుండే చర్మపు పొరను శాస్త్రీయ పరిభాషలో "కార్నియల్ లేయర్" అని పిలుస్తారు. ఇంతటి పలుచని చర్మంలో స్వేదగ్రంథులు నివాసం ఏర్పరుచుకోలేవు. పెదవులలో మనకి స్వేదగ్రంథులు లేకపోవటంవల్ల, ఆ ప్రదేశం ఎక్కువగా పొడిగా వుంటుంది. ఈ కారణం వల్లనే చలికాలంలో పెదవులు పగుళ్ళివ్వడం (దీనినే 'క్రాక్' ఇవ్వటం అని అంటారు) జరుగుతుంటుంది. ఇలా పగిలిన పగుళ్ళ మధ్యనుండి పెదవులపైన పూసిన లిప్‌స్టిక్ నెమ్మదిగా కార్నియల్ లేయర్‌ను దూసుకుని చర్మపు అంతర్ భాగాలలోనికి పోయి అనేక రకాలైన 'ఎలర్జీ' వ్యాధులను, 'హైపర్ సెన్సిటివిటీ'ను కలిగిస్తుంది. ఈ కారణంవల్లనే కొంతమంది స్త్రీలలో కనురెప్పలమీద దురద, వాపు రావడం, చర్మం మీద చిన్న చిన్న దద్దుర్లు రావడం, మోచేయి క్రింది భాగంలో దురద సలపటం జరుగుతుంటుంది. ఇవి పడని కొందరికి తల నొప్పి రావడం, అతిగా జలుబు - తుమ్ములు, దురద మొదలయినవి కూడా వస్తుంటాయి. అంచేతనే ప్రస్తుతం యువతులు, స్త్రీలు వాడుతున్న సౌందర్య సాధనాలన్నింటిలోకి అతి ప్రమాదకరమైనవి ఈ లిప్‌స్టిక్‌లు అని అంటారు.

—సి. హెచ్. జయ